సాక్షి వికారాబాద్

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



జాతీయ పోటీలకు..

కుల్కచర్ల జెడ్పీహెచ్ఎస్ (బాలుర)కు చెందిన విద్యార్థి కె.విశాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 10లో▸



ఆక్రమణల తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునుగనూరులో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. 10లో▸



సడక్ ఏదీ?

పెద్దేముల్ మండలం తట్టెపల్లి ఉన్నత పాఠశాలకు సరైన రోడ్డు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 11లో▸

కొనుగోలు.. కొర్రీలు



వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం

- సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు ఆసక్తి చూపని రైతులు
- ధర తక్కువైనా ప్రైవేట్ వ్యక్తులకే..
- జిల్లా వ్యాప్తంగా 2.45 లక్షల ఎకరాల్లో పంట సాగు
- దిగుబడి అంచనా 2.45 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు లక్ష్యం 8లక్షల క్వింటాళ్లు
- 14 కేంద్రాల ఏర్పాటు

వికారాబాద్: పత్తి రైతులు దళారుల బారిన పడకుండా నేరుగా పంట దిగుబడిని కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కొనుగొలు కేంద్రాల నిర్వాహకులు(సీసీఐ) తేమ శాతం, పొట్టి పింజ రకం, పొడుపు పింజ రకం వంటి కొర్రీలు పెట్టి ప్రభుత్వ మద్దతు ధర తగ్గిస్తుండటంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలకు పత్తి రాక వెలవెలబోతున్నాయి. పత్తి కొనుగోలుకు కఠిన నిబంధనలు పెడుతుండడంతో రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. దళారులు క్వింటాలుకు రూ. 500 వరకు తక్కువ ఇస్తున్నా వారికే విక్రయిస్తున్నారు.

కొనేది గోరంత

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు నామమాత్రమే. జిల్లాలో తెల్ల బంగారం కొనుగోలుకు 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు.తాండూరు పరిధిలో మూడు, వికారాబాద్ ప్రాంతంలో మూడు, పరిగిలో మూడు, మర్పల్లి, కోట్‌పల్లి, ధారూరు, కొడంగల్‌లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో కొన్ని, డిసెంబర్ మొదటి వారంలో మరికొన్ని కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ అధికారులతో పాటుగా సీసీఐ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 2.45వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా ఒక్కో ఎకరాకు 8నుంచి 10 క్వింటాళ్ల చొప్పున మొత్తం 2.30 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి నెల రోజు లు దాటినా కేవలం 12,450 క్వింటాళ్లు మాత్రమే సేకరించారు.

కొర్రీలతో రైతులు దూరం

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలు పత్తికి మద్దతు ధర రూ.7,020గా నిర్ణయించింది. ప్రైవేటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లులు, బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 6,500 వరకు ఇస్తున్నారు. అయితే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, పొట్టి పింజ రకం, పొడుపు పింజ రకం వంటి కొర్రీలు పెట్టి ధర తగ్గిస్తుండడం, సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి విక్రయిస్తే క్వింటాలుకు రూ. 500లు తగ్గినా ఎలాంటి నిబంధనలు లేకపోవడం, వెంటనే డబ్బులు ఇస్తున్నట్లు రైతులు తెలిపారు. పత్తిలో 8శాతం తేమ ఉంటే సీసీఐ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధరలో కోత విధిస్తున్నట్లు తెలిసింది. 12శాతం తేమ ఉంటే కొనుగోలు చేయడంలేదు. అంతేకాకుండా పొట్టి పింజ రకం, పొడుపు పింజ రకం అనే తేడాలతో ధరలు తగ్గించడం, వాతావరణ పరిస్థితులతో కొద్దిగా రంగు మారినా పత్తిని తీసుకోకపోవడం వంటి కారణాల వల్ల రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు వెళ్లడం లేదు. అదే విధంగా డబ్బులు ఆలస్యంగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుండడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. మరో వైపు ఆన్‌లైన్‌లో పత్తి విస్తీర్ణం నమోదు చేయకపోవడం కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో రైతులు దళారుల గడప తొక్కక తప్పడం లేదు.



అధికారులతో మాట్లాడుతున్న సీడీఎంఏ అధికారి హరిచందన

నివేదికలు ఇవ్వండి

- సీడీఎంఏ అధికారి హరిచందన
- కొడంగల్‌లో పర్యటన
- మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో చర్చలు
- సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

కొడంగల్: కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారి హరిచందన గురువారం కొడంగల్‌లో పర్యటించారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్న ఆమె అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ భూములపై రెవెన్యూ సర్వే అధికారులతో ఆరా తీశారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పట్టణంలోని సిటిజన్ క్లబ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలాన్ని చిల్డ్రన్ పార్క్ కోసం కేటాయించి అందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తాండూరు రోడ్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ స్థలంలో మినీ ఇండోర్ స్టేడియాల నిర్మాణం కోసం అవకాశం ఉంటే ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులపై అధికారులతో చర్చించారు.లాహోటి కాలనీలోని నర్సరీ, పార్కులను సందర్శించారు. నర్సరీలో అన్ని రకాల మొక్కలను పెంచేందుకు, పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడి నుంచి పట్టణ శివారులోని సిద్దనొంపు సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని, పక్కనే ఉన్న మిషన్ భగీరథ సంప్ హౌస్ ను పరిశీలించారు. తాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాలను సందర్శిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి పట్టణ శివారులోని పెద్ద చెరువును పరిశీలించారు. చెరువు రహదారిలో పగుళ్ల పడిన దృశ్యాలను చూసి అధికారులతో ఆరా తీశారు. మినీ ట్యాంక్‌బండ్ కొరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులపై ఆరా తీస్తూ టెండర్లు కాని వాటికీ టెండర్ల వేసి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టెండర్లు పూర్తయిన పనులకు రీ డిజైన్‌తో పనులు జరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంత బజార్‌లో మౌలిక వసతులను పరిశీలించారు. అభివృద్ధి పనులతోపాటు చేపట్టాల్సిన అంశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటి తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ కోటిరెడ్డి

గంజాయికి అడ్డుకట్ట వేయండి

- సరఫరాపై పటిష్ట నిఘా ఉంచాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కోటిరెడ్డితో కలిసి జిల్లాస్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు ప్రాంతాల్లో గంజాయి ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, దీన్ని మొగ్గలోనే తుంచేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలయ్యే అవకాశం ఉన్నందున విద్యాసంస్థల్లో డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి, వారానికి ఒకసారి సమావేశం నిర్వహించాలని సూచించారు. ప్రతి నెలా జిల్లాస్థాయిలో కూడా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యాసంస్థల తోపాటు మహిళా సంఘాలు, లోకల్ బాడీల్లో కూడా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు తమ పంట పొలాల్లో గంజాయి మొక్కలు పెంచకుండా వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గంజాయి మొక్కలు పెంచితే రైతు బంధు రైతు బీమా వంటి పథకాలు అందవని తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు రవాణా కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 25 డ్రగ్స్ కేసులు నమోదు చేసి 128 మందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల్లో మాదకద్రవ్యాలు వినియోగించకుండా నిఘా పెంచినట్లు వెల్లడించారు. జిల్లాలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్ ఎక్సైజ్, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పని చేస్తాయని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, డీఈఓ రేణుకాదేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జీవరాజ్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌తో ఆదాయం



కరన్‌కోట్ సీసీఐ ఫ్యాక్టరీని సందర్శిస్తున్న కాంతారావు, పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు

- ఆ దిశగా యాక్షన్ ప్లాన్
- కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు
- సీసీఐ ఫ్యాక్టరీలో మైనింగ్ ఏరియా పరిశీలన
- నేడు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సమావేశం

తాండూరు రూరల్: సహజ సిద్ధమైన మైనింగ్ ద్వారా రాష్ట్ర ఆదాయం పెంపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు తెలిపారు. గురువారం మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులో గల సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కర్మాగారాన్ని ఆయన సందర్శించారు. సీసీఐ సీఎండీ సంజయ్‌బంగా, ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ బీఎం మహంతో కలిసి పరిశ్రమలోని కంట్రోల్ రూం తోపాటు మైనింగ్ ఏరియాను పరిశీలించారు. పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మైనింగ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆదాయం సమకూర్చుకోవడం లేదన్నారు. గడిచిన ఎనిమిదేళ్లలో ఒడిశాలో వేసిన టెండర్ల ద్వారా ఆ రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 400 మైనింగ్ టెండర్లు వేసినట్లు వివరించారు. కానీ తెలంగాణలో ఇప్పటి వరకు ఒక్క టెండర్ కూడా పూర్తి కాలేదని స్పష్టం చేశారు. తెలంగాణలో మైనింగ్ పుష్కలంగా ఉన్నా ఎందుకు టెండర్లు వేయడం లేదనే విషయంపై చర్చిస్తామని తెలిపారు.

నగరంలో నేడు ఉన్నతస్థాయి మీటింగ్

కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ శాఖ కార్యదర్శి కాంతారావు తెలిపారు. రాష్ట్రంలో మైనింగ్‌కు సంబంధించి పూర్తి సమాచారంతో సమావేశం ఉంటుందన్నారు. టెండర్లు ఎందుకు వేయలేదనే అంశాన్ని కూడా చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీఐ హెచ్ఆర్ ప్రతినిధి అమిత్ రంజన్, వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, మైన్స్ ఏడీ జాకబ్, డీఆర్‌డీఓ కృష్ణన్, తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐ రాజిరెడ్డి, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముందుగానే చేరుకున్న సీఎండీ

వీఎల్ కాంతారావు పర్యటన నేపథ్యంలో సీసీఐ సీఎండీ సంజయ్‌బంగా గురువారం ఉదయమే ఫ్యాక్టరీకి చేరుకున్నారు. వివిధ విభాగాల అధికారులతో సమావేశమై పరిస్థితులను చక్కదిద్దారు. రెండు రోజుల పాటు ఆయన ఫ్యాక్టరీలోనే ఉంటారని స్థానిక అధికారులు తెలిపారు.

సీఎం నోట.. రాచకొండ మాట


అభివృద్ధిపై చిగురించిన ఆశలు

మంచాల: సీఎం రేవంత్‌రెడ్డి నోట రాచకొండ గుట్టల ప్రస్తావన రావడం ఈ ప్రాంత అభివృద్ధిపై చర్చకు దారితీసింది. 2014 డిసెంబర్ 14న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాచకొండ గుట్టలను సందర్శించారు. ఈ సందర్భంగా రాచకొండ చరిత్రను కాపాడుకోవడమే గాకుండా పర్యాటక కేంద్రంగా విరాజిల్లేలా సినీ హబ్‌ను ఏర్పాటు చేసి చిత్ర పరిశ్రమే ఇక్కడకు వచ్చేలా చూస్తామని అన్నారు. వివిధ పరిశ్రమలను ఏర్పాటు చేసి వెనుకబాటుకు గురైన ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో ఈ ప్రాంత అభివృద్ధిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. తర్వాత ఈ హామీలు అమలుకు నోచుకోలేదు.

మరోసారి హాట్‌టాపిక్

ఇన్నాళ్లకు తిరిగి మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోట రాచకొండ గుట్టల మాట రావడం హాట్ టాపిక్‌గా మారింది. 'రాచకొండ ప్రాంతంలో ప్రజలందరినీ మమేకం చేసి.. ఓ కొత్త నగరాన్ని నిర్మిస్తే ప్రకృతి అందాల మధ్య ఊటీని తలపిస్తుంది' అని పేర్కొనడంతో అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురించాయి.

చరిత్రను కాపాడాలి



చారిత్రక రాచకొండ దేవాలయాలు, నిర్మాణాలను పరిరక్షించి చరిత్రను కాపాడాలి. పదేళ్లుగా రాచప్ప సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రాచకొండలోని దేవాలయాలను అభివృద్ధి పర్చడం, దూపదీప నైవేద్యాల నిర్వహణ చేస్తున్నాం.

– సురంపల్లి వెంకటేశ్, రాచప్ప సమితి ప్రధాన కార్యదర్శి

అభివృద్ధికి కృషి చేయాలి



రాచకొండ గుట్టలకు రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ నాటి రేచర్ల పద్మనాయకులు రాజధానిగా వెలిసిల్లిన పట్టణం ఇది. ఇక్కడ పురాతన కట్టడాలు ఉన్నాయి. వాటిని కాపాడడమే గాకుండా వనరులను సద్వినియోగం చేసుకొని ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి.

– కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ఆరుట్ల

అభివృద్ధి దిశగా అడుగులు

- స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో టీయూఎఫ్ఐడీసీ రుణం మంజూరు
- రూ.60 కోట్లతో జిల్లా కేంద్రంలో మౌలిక వసతులు, పట్టణ సుందరీకరణ పనులు



వికారాబాద్ పట్టణం

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రం అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. పట్టణ, వార్డుల అభివృద్ధికి, సుందరీకరణ పనులకు వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో టీయూఎఫ్ఐడీసీ రుణం మంజూరైనట్లు తెలిసింది. గతంలో వికారాబాద్ ఆశించిన మేర అభివృద్ధి జరగలేదు. గత పాలకులు ఈ ప్రాంత అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తెస్తామని చెప్పినా ఆ దిశగా ముందుకు సాగలేదు. దీంతో పట్టణ అభివృద్ధి ఎక్కడికక్కడ ఆగిపోయిందనే అపవాదు ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ స్థానం నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్ గెలవడం అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టడంతో జిల్లా కేంద్రం అభివృద్ధిపై ప్రజల్లో అంచనాలు పెరిగాయి. ఇటీవల వికారాబాద్ అభివృద్ధిపై స్పీకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల్లో పురోగతి ఉండాలని, వేగంగా అభివృద్ధి జరగాలని ఆదేశించారు.

రూ. 60కోట్లు రుణం మంజూరు

గత ప్రభుత్వం జిల్లా కేంద్రం అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నుంచి రుణం మంజూరు చేయిస్తామని ఊరిస్తూ వచ్చింది. కానీ నిధులు మంజూరు చేయలేదు. అయితే ఇటీవల కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఇటీవల ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రుణం మంజూరు చేయించినట్లు తెలిసింది. దీంతో కలెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల పట్టణ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు సమాచారం. మంజూరైన నిధుల్లో రూ.30 కోట్లు ఆర్అండ్‌బీకి కేటాయించినట్లు తెలిసింది. ఈ నిధులతో రోడ్ల మరమ్మతులు, విస్తరణ పనులు, సెంట్రల్ లైటింగ్, కూడళ్ల సుందరీకరణ వంటి పనులు చేపట్టనున్నారు.

వార్డుల అభివృద్ధికి..

మంజూరైన నిధుల్లో మరో రూ. 30కోట్లు వార్డుల అభివృద్ధికి కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. మున్సిపల్ పరిధిలోని 34 వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే చైర్‌పర్సన్ ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. ఏఏ పనులు చేపడతారు అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

పాత ప్రతిపాదనలు కొన్ని పరిగనలోకి..

గత ప్రభుత్వ ప్రతిపాదనలను కొన్ని పరిగనలోకి తీసుకొని వాటిని పూర్తి చేయాలనే ఆలోచన అధికారులు ఉన్నట్లు తెలిసింది. ప్రధానంగా జిల్లా కేంద్రంలోని ప్రతి కూడలిని సుందరంగా తీర్చిదిద్దడం తోపాటు, పచ్చదనం ఉట్టి పడేలా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎన్నెపల్లి నుంచి కలెక్టరేట్ వరకు, అలాగే బీజేఆర్ చౌరస్తా నుంచి రామయ్యగూడ వరకు రోడ్డు డివైడర్ల ఏర్పాటు, ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అనంతగిరి రైల్వే ట్రాక్ వరకు, ఆలంపల్లి చింతచెట్టు నుంచి కొత్త గడి వరకు రోడ్డు డివైడర్ ఏర్పాటు తోపాటు కొత్తగా మున్సిపాలిటీలో కలిసిన మద్గుల్ చిట్టంపల్లి, ధన్నారం, గెరిగెట్‌పల్లి, కొంపల్లి, బూర్గుపల్లి, గుడుపల్లిలో కొత్తగా కూడళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అన్ని అనుకూలిస్తే మరో నెలరోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో ప్రతిపాదనలు



ఇటీవల టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 60కోట్ల రుణం మంజూరైంది. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో త్వరగా పనులను ప్రారంభిస్తాం. మున్సిపల్ పరిధిలోని 34 వార్డుల అభివృద్ధికి ప్రసాద్ కుమార్ రూ. 30కోట్లు కేటాయించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన ప్రణాళిక తయారు చేయడం జరుగుతుంది. మరో వారం, పది రోజుల్లో పనులపై మరింత స్పష్టత వస్తుంది.

– మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్

న్యూస్‌రీల్

అడవిలో మొక్కల పరిశీలన



నాగసమందర్ అటవీ ప్రాంతంలో మొక్కలను పరిశీలిస్తున్న జ్ఞానేశ్వర్

ధారూరు: మండలంలోని నాగసమందర్ రిజర్వుడు ఫారెస్ట్ ఖాళీ ప్రదేశంలో నాటిన మొక్కలను గురువారం జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ పరిశీలించారు. మొక్కల గురించి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 25 ఎకరాల్లో 20 రకాల 11,100 మొక్కలు నాటినట్లు సెక్షన్ ఆఫీసర్ వివరించారు. మొక్కల చుట్టూ ఎప్పటికప్పుడు గడ్డిని తొలగించి మట్టి తీసి పాదుకలు తయారు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సుందర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కృష్ణ, జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సుచరితారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు దొర్లొద్దు

మాస్టర్ ట్రైనర్ నాగరాజు



ఓటరు నమోదుపై శిక్షణ ఇస్తున్న నాగరాజు

మోమిన్‌పేట: ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని మాస్టర్ ట్రైనర్ నాగరాజు బీఎల్ఓలకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలకు ఓటరు జాబితాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలకు ప్రస్తుతం రూపొందించే ఓటరు జాబితా ప్రామాణికం కానుందని తెలిపారు. ఇంటింటికి తిరిగి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేయాలన్నారు. అలాగే చనిపోయిన వారి పేర్లను, డబుల్ ఎంట్రీలను తొలగించాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు రానున్న స్థానిక ఎన్నికలకు కూడా ప్రస్తుతం తయారు చేసే ఓటరు జాబితా ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ నటరాజు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వానాకాలం సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, డబ్బు చెల్లింపుపై గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ధాన్యం తరలింపునకు వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సేకరించిన ధాన్యానికి ఎప్పటికప్పుడు చెల్లింపులు జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీఓ కృష్ణన్, పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శంకరాచారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డీసీఎంఎస్ మేనేజర్ పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బంట్వారం: వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మండలంలోని తొర్మామిడి కాంగ్రెస్ నాయకులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు తౌఫిక్, కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అజీమ్, గౌస్, నాయకులు వెంకటేశం, మల్లేశం, రాజు, నర్సింలు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ప్రజాభవన్‌ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన ప్రజాభవన్‌

తాండూరు: పట్టణ శివారులోని ప్రజా భవన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఉదయం 7 గంటలకు పూజ కార్యక్రమాల అనంతరం నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రజా భవన్‌లో అడుగుపెట్టనున్నారు. కార్యాలయంలో ఫర్నీచర్‌తో పాటు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయించారు.

పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీదే విజయం

పార్టీ సీనియర్‌ నాయకుడు జనార్దన్‌రెడ్డి



వికారాబాద్‌ అర్బన్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆపార్టీ సీనియర్‌ నాయకుడు బెక్కరి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన అనంతగిరి హరిత రిసార్టులో విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజలు మోదీ పాలనకే మొగ్గు చూపుతున్నారన్నారు. దేశ ప్రతిష్ట మోదీ మాత్రమే నిలపెడుతారని ప్రజలు గ్రహించారన్నారు. తెలంగాణాలోనూ ప్రజలు కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మరని.. పార్లమెంట్‌ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అత్యధిక సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాటల గారడితో ఒకరు, అంకెల గారడితో మరొకరు ప్రజలు మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్రంలో బలంగా ఉందని ఈ పార్లమెంట్‌ ఎన్నికల్లో పది స్థానాల్లో కమలం జెండా ఎగురవేస్తామన్నారు.

పెట్రోల్‌ బంక్‌ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న జేసీ లింగానాయక్‌

పెద్దేముల్‌: మండల పరిధిలోని కందనెల్లి సమీపంలో తాండూరు–హైదరాబాద్‌ ప్రధాన రహదారి పక్కన పెట్రోల్‌ బంక్‌ ఏర్పాటుకు లాలప్ప దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు గురువారం జేసీ లింగానాయక్‌ సర్వేనెంబర్‌ 226లోని ఆరుగుంటల భూమిని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, పెద్దేముల్‌ తహసీల్దార్‌ కిషన్‌, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ రాజిరెడ్డి, ఈఓఆర్డీ రమేశ్‌ ఉన్నారు.

దాస్యనాయక్‌ తండా సర్పంచ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్‌ శంకర్‌ నాయక్‌

కుల్కచర్ల: మండల పరిధిలోని దాస్యనాయక్‌ తండా సర్పంచ్‌కు వరల్డ్‌ హ్యూమన్‌ రైట్స్‌ సంస్థ ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు అందజేసింది. ఢిల్లీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌ శంకర్‌నాయక్‌కు రెజ్లింగ్‌ ఒలంపిక్‌ విజేత నర్సింగ్‌ యాదవ్‌, బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు అనిల్‌ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్‌ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతానికి చెందిన తాను చేపట్టిన సామాజిక కార్యక్రమాలను గుర్తించి అవార్డు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

క్రిస్మస్‌ కానుకలు సిద్ధం

తాండూరు: క్రిస్మస్‌ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గానికి వేయి క్రిస్మస్‌ కానుకలు (నూతన వస్త్రాలు)వచ్చినట్లు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. పట్టణంతో పాటు గ్రామాల్లో నిరుపేద క్రైస్తవుల జాబితా సిద్ధం చేయాలని కోరారు. క్రిస్మస్‌ విందు కోసం ప్రభుత్వం రూ.2 లక్షలు ఇస్తుందని వివరించారు.

బీజేపీతోనే సుపరిపాలన

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



దోమ: కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

దోమ: బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని దొంగఎన్కెపల్లి గ్రామంలో వీక్షిత్‌ భారత్‌ సంకల్ప యాత్రంలో భాగంగా ఆయన గ్రామస్తులకు మోదీ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మన దేశ కీర్తి ప్రపంచ నలుమూలలా తీసుకెళ్లేందుకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి మోదీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతి కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, జిల్లా కార్యదర్శి పెంటయ్య, మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘ఇస్తేమా’కు నిధులు ఎందుకు..?

పరిగి: ఇస్తేమా నిర్వాహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అనవసరం అని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణ కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న తబ్లిగీ జమాన్‌ సంస్థను ఇస్లామిక్‌ దేశాలు సైతం బ్యాన్‌ చేశాయని.. పరిగిలో నిర్వహించాల్సిన అవసరం ఏముంది అంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇస్తేమా మూఢనమ్మకాలను ప్రచారం చేస్తోందని తప్పుబట్టారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేస్తే.. కాంగ్రెస్‌ ప్రభుత్వం కొంత నిధులు తగ్గించి కేటాయించిందన్నారు. కేంద్రం కరోనా కట్టడికి ఆంక్షలు విధిస్తుంటే... ఇలాంటి ఉత్సవాలు చేపట్టడం సరికాదన్నారు. తప్పని పరిస్థితుల్లో ఇస్తేమా నిర్వహిస్తే అధికారులు, ప్రభుత్వం కరోనా ఆంక్షలను పాటిస్తూ రాష్ట్ర ప్రజలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మిట్ట పరమేశ్వర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగితాలపై గ్రాంట్లు.. ఖజానా నిల్‌

- స్వలాభం కోసమే రోహిత్‌రెడ్డి పార్టీ మారారు
- పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌

తాండూరు: తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌ రెడ్డి మంజూరు చేయించానని చెబుతున్న పనుల వివరాలు కేవలం కాగితాలపైనే ఉన్నాయని ఖజానాలో మాత్రం నిధులు శూన్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ మురళీకృష్ణగౌడ్‌ విమర్శించారు. గురువారం కాంగ్రెస్‌ పట్టణ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను ప్రస్తుత ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారంటూ రోహిత్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. కాంగ్రెస్‌ నుంచి గెలిచిన రోహిత్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలను, నాయకులను మోసం చేసి స్వలాభం కోసమే పార్టీ మారారన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని.. ఎస్‌డీఎఫ్‌ పనులను చేపట్టేందుకు వచ్చే కాంట్రాక్టర్లను ప్రోత్సహించాలని చెప్పిన మనసున్న వ్యక్తి మనోహర్‌రెడ్డి అన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక హెచ్చరికలు చేస్తే ఎవరూ భయపడరని సమాధానం ఇచ్చారు. టికెట్టు ఖరారైన 35 రోజుల్లోనే తాండూరు ప్రజల మనసు గెలిచి ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి గెలిచిన విషయాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హ బీబ్‌ లాల, మహిళ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు శో భారాణి, మండల అధ్యక్షుడు నాగప్ప, గోపాల్‌, నర్సిరెడ్డి, మాధవి, సర్దార్‌ ఖాన్‌ తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

అదనపు కలెక్టర్‌ లింగ్యా నాయక్‌



పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న లింగ్యానాయక్‌

యాలాల: వరి, పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ లింగ్యానాయక్‌ అధికారులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని అగ్గనూరులోని పత్తి, వరి కొనుగోలు కేంద్రాలను, దౌలాపూర్‌ సమీపంలోని శుభం జిన్నింగ్‌ మిల్లులోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తున్నారా లేదా అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పత్తి విక్రయాల్లో జాప్యం కలగకుండా వేగంగా కొనుగోలు, చెల్లింపుల ప్రక్రియ చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట యాలాల తహసీల్దార్‌ మునీరుద్దీన్‌, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాండురంగం, మల్లేషం తదితరులున్నారు.

జాతీయ పోటీలకు కుల్కచర్ల విద్యార్థి



తాండూరు టౌన్‌: విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి



విశాల్‌

కుల్కచర్ల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ (బాలుర)కు చెందిన విద్యార్థి కె.విశాల్‌ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 15వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్‌–14 వాలీబాల్‌ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విశాల్‌ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 26వరకు ఒరిస్సాలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ఎంఈఓ హబీబ్‌ అహ్మద్‌, పాఠశాల చైర్మన్‌ రవిచందర్‌, పీడీ ఖాజ విద్యార్థికి అభినందనలు తెలిపారు.

సైన్స్‌ ఫెయిర్‌కు ‘అక్షర’ విద్యార్థులు

తాండూరు టౌన్‌: పట్టణంలోని అక్షర కాన్సెప్ట్‌ స్కూల్‌ విద్యార్థులు జాతీయ సైన్స్‌ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. గురువారం వికారాబాద్‌ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎంపికైన విద్యార్థులు వర్ష, అనిరుధ్‌, సందీప్‌లను ఎస్పీ కోటిరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న అధికారులు

హయత్‌నగర్‌: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునుగనూరులోని సర్వే నంబర్‌ 38లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గురువారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ బోడ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో నిర్మాణాలను పరిశీలించి, అక్రమ నిర్మాణాలుగా గుర్తించి వాటిని పోలీసులు, జేసీబీ సహాయంతో కూల్చి వేశామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది కొరత కారణంగా అక్రమ నిర్మాణాలు గుర్తించడంలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూమిని రక్షించేందుకు అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హయత్‌నగర్‌ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

దారి దోపిడీకి యత్నం

- ఇద్దరు యువకుల అరెస్ట్‌
- మారణాయుధాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

మైలార్‌దేవ్‌పల్లి: దారి దోపిడీకి పథకం పన్నిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్‌ చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది .సీఐ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..గంజాయి సరఫరా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం లక్ష్మిగూడ వాంబేకాలనీ రోడ్డులో శంషాబాద్‌ ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు లింగయ్య,హరినాథ్‌ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకును అనుమానంతో ఆపడానికి యత్నించగా, వారు తమ వద్ద నున్న పెప్పర్‌ స్ప్రే బాటిల్‌తో పోలీసులపై స్ప్రే చేసి బైక్‌ను అక్కడే వదిలి పరారయ్యారు. కానిస్టేబుళ్లు ఈ ఘటనపై ఉన్నతాధితారులకు సమాచారం అందించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌ స్పెక్టర్‌ మధు, డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌ వారు వదిలి వెళ్లిన బైక్‌ నంబర్‌ ఆధారంగా నిందుతులను అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి రెండు స్టీల్‌ కత్తులు, డమ్మీ పిస్టల్‌ ,రెండు చిల్లీ స్ప్రే బాటిళ్లు, రెండు సెల్‌ ఫోన్లు స్వాధినం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఫలక్‌నుమాకు చెందిన ఖారింఖాన్‌ మోతిజైన్‌, మతిన్‌ ఖాన్‌ (23గా గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఇరువురు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లే వారిని బెదిరించి డబ్బులు లాక్కోవాలని పథకం పన్నినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ ఆత్మహత్య



నాగచక్రపాణి(ఫైల్‌)

గచ్చిబౌలి: ఓ సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్‌ బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా, బత్తలూరు గ్రామానికి చెందిన దంపతులు గజ్జల నాగశేషులు, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు గజ్జల నాగచక్రపాణి(28) ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌గా పని చేస్తూ గచ్చిబౌలిలోని పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు రోజులుగా ఆఫీసుకు సెలవు పెట్టి గదిలోనే ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం హాస్టల్‌ వద్దకు వచ్చిన శివ నాగరాజుతో మాట్లాడిన అనంతరం గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చిన రూమ్మేట్‌ వేణుగోపాల్‌ రెడ్డి ఎంత పిలిచినా స్పందించలేదు. హాస్టల్‌ నిర్వాహకులతో కలిసి కిటికీలోంచి చూడగా సీలింగ్‌ ఫ్యాన్‌కు బెడ్‌ షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించండంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమారుడు అదృశ్యం



అదృశ్యమైన తల్లీకొడుకు(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: మూడేళ్ల కుమారుడితో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ బి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్‌ హబీబ్‌ కాలనీకి చెందిన సయ్యద్‌ హమీద్‌, సీమాబేగం (28)లు భార్యాభర్తలు. ఈ నెల 6వ తేదీనా సాయంత్రం భర్త ఇంట్లో లేని సమయంలో సీమాబేగం తన చిన్న కుమారుడు సయ్యద్‌ మహ్మద్‌(3)తో కలిసి బయటకు వెళ్లిపోయింది. సీమాబేగం నిజామాబాద్‌లో ఉండే దూరపు బంధువు షేక్‌ సాజిద్‌తో తరచూ ఫోన్‌ మాట్లాడేదని, అదృశ్యానికి అతడే కారణమంటూ భర్త గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



కృష్ణకుమార్‌గౌడ్‌ (ఫైల్‌)

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన చన్గోముల్‌ పీఎస్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన జి.కృష్ణకుమార్‌ గౌడ్‌ చేవెళ్ల మండలం ఆలూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని మన్నేగూడ వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో కండ్లపల్లి గేటు సమీపంలో ఎదురుగా స్టీల్‌లోడ్‌ వస్తున్న డీసీఎం ఢీకొట్టడంతో ప్రమాద స్థలిలో ప్రాణాలొదిలాడు. మృతుడికి భార్య, కుమారుడున్నారు. భార్య హంసవేణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ తీయలేదని..

దుండిగల్‌: ట్యాంకర్‌కు అడ్డుగా ఉన్న బైక్‌ను తీయడానికి నిరాకరించిన యువకుడిపై దాడి చేయడంతో యువకుడు మృతి చెందిన ఘటన దుండిగల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్టకు నాగశివ(29) క్యాటరింగ్‌ పనులు చేస్తుంటాడు. ఈ నెల 20న పని ఉండడంతో బైక్‌పై డి.పోచంపల్లి కృష్ణానగర్‌లో ఉంటున్న సహచరుడి వద్దకు వెళ్లారు. అతని ఇంటి పక్కనే బైక్‌ను పార్క్‌ చేసి వేచి చేస్తున్నారు. అదే సమయంలో కృష్ణానగర్‌కు చెందిన అనుశ్‌ సెప్టిక్‌ ట్యాంకర్‌కు అడ్డుగా పెట్టిన బైక్‌ను తీయాలని కోరగా, వారు నిరాకరించారు. దీంతో అనుశ్‌ తన అనుచరుల తో కలిసి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన నాగశివ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘరానా దొంగ అరెస్ట్‌

ముషీరాబాద్‌: ఇళ్ల తాళాలు పగల గొట్టి చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను ముషీరాబాద్‌ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, తాళ్లూరుకు చెందిన రాయ పాటి వెంకటరావు(51) నిజాంపేట్‌లోని పీపీఆర్‌ హోమ్స్‌లో నివాసం ఉంటున్నాడు. చోరీలనే వృత్తిగా ఎంచుకున్న అతడిపై ఎస్‌ఆర్‌నగర్‌, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ తదితర పోలీస్‌ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. గత నెల 28న ముషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని లక్ష్మి అనూష అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న డెబోరా ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 23.2 తులాల బంగారు నగలు, రూ.93 వేల నగదు, మూడు ఏటీఎం కార్డులు చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఎస్సై చలపతిరెడ్డి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు రాయపాటి వెంకటరావును అరెస్టు చేశారు. అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

విశ్వహిందూ పరిషత్‌ రాష్ట్ర సేవా ప్రముఖ్‌ బండారి రమేశ్‌



సమావేశంలో మాట్లాడుతున్న బండారి రమేశ్‌

షాద్‌నగర్‌: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికి అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్‌ రాష్ట్ర సేవా ప్రముఖ్‌ బండారి రమేశ్‌ తెలిపారు. గురువారం పట్టణంలోని పతంజలి యోగా కేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ఆధ్వర్యంలో పూజిత అక్షింత వితరణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్యలో ఆలయ నిర్మాణం హిందువుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. అక్షింతల ఊరేగింపు కార్యక్రమం దేశ వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు గడపగడపకూ అయోధ్య పూజిత అక్షింతల వితరణ ఉంటుందన్నారు. ఈ మహా కార్యక్రమంలో హిందూ బంధువులందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌, వసంత వెంకటేశ్‌, రాచయ్య, చెట్ల వెంకటేశ్‌, బండి కిరణ్‌, ప్యాట వంశీ, బాలబ్రహ్మాచారి, గిరి, రమేశ్‌, డిస్కో శ్రీనివాస్‌, శేఖర్‌, వీరప్ప, హన్మంత్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔను.. కలిసిపోతున్నారు..



సరూర్‌నగర్‌ మహిళా పోలీస్‌స్టేషన్‌

విడిపోదామనుకుని.. ఒక్కటైన జంటలు

- చిన్న తగాదాలకే మనస్పర్థలు, గొడవలు
- వేధిస్తున్నారంటూ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు
- కౌన్సెలింగ్‌ తర్వాత ఒక్కటవుతున్న దంపతులు

హుడాకాంప్లెక్స్‌: క్షణికావేశంలో దంపతుల మధ్య మనస్పర్థలు.. తగాదాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ ఉన్న కుటుంబాలను ఒక్కటి చేయడమే లక్ష్యంగా సరూర్‌నగర్‌ మహిళా పోలీసులు కృషి చేస్తున్నారు.

యువజంటల్లో ఎక్కువ..

రామకృష్ణాపురానికి చెందిన ఓ యువ జంట మధ్య మనస్పర్థలు తలెత్తాయి. అది కాస్తా పెరిగి పెద్దదై చివరకు విడాకుల వరకు వెళ్లింది. ఇరువురు సరూర్‌ నగర్‌ మహిళా పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు దంపతులిద్దరిని కూర్చోబెట్టి కౌన్సిలింగ్‌ ఇచ్చారు. శాశ్వతంగా విడిపోదామనుకున్న వారు ఒక్కటైపోయారు. హస్తినాపురానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ దంపతులు. పిల్లల పెంపకం విషయంలో ఇద్దరు గొడవపడ్డారు. పెద్దలు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. శాశ్వతంగా విడిపోయేందుకు నిర్ణయించుకున్నారు. భర్త వేధిస్తున్నాడని భార్య... కాదు భార్యే తనను వేధిస్తుందని భర్త ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు ఇద్దరిని కూర్చోబెట్టి ఒకటికి రెండుసార్లు కౌన్సిలింగ్‌ ఇవ్వడంతో ఒక్కటయ్యారు. ఇలా ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా 1799 జంటలను కలిపారు.

2649 ఫిర్యాదులు

అదనపు కట్నం కోసం, పిల్లల పెంపకంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, సందపాన లేదని, మందు తాగుతున్నాడని.. ఇలా వివిధ కారణాలతో ఘర్షణ పడుతున్నారు. ఒక్కటైన యువ జంటలు చిన్న చిన్న అంశాలను పెద్దగా భావించి ఎడబాటును కొని తెచ్చుకుంటున్నారు. కక్ష్యసాధింపు చర్యల్లో భాగంగా ఒకరిపై మరొకరు కేసులు నమోదు చేసుకుంటున్నారు. ఇలా ఈ ఏడాది 2023లో 2649 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఎఫ్‌ఐఆర్‌కు ముందే పోలీసులు వారికి కౌన్సిలింగ్‌ ఇస్తున్నారు. విడిపోదామనుకున్న వారు కౌన్సిలింగ్‌తో మనసు మార్చుకుంటున్నారు. ఇలా ఈ ఏడాది 1799 జంటలు పోలీసుల కౌన్సిలింగ్‌తో ఒక్కటయ్యారంటే ఆశ్చర్యం వేయకమానదు. 552 కేసుల్లో ఎఫ్‌ఐఆర్‌ చేసినట్లు సమాచారం.

సహనం కావాలి...



రోజుకు 10–15 యువ దంపతుల నుంచి ఫిర్యా దులు వస్తుంటాయి. సంసారంలో సహనం లేక వి వాహమైన రెండు మూడేళ్లకే గొడవపడుతుంటారు. ఒకరిని ఒకరు అర్థం చేసుకోక క్షణికావేశంలో జీవి తాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఆగ్రహంగా వ చ్చిన వారు కూడా నచ్చజెప్పడంతో 70 శాతం జంటలు ఒక్కటై వెళ్తుంటారు. కౌన్సిలింగ్‌ ఇచ్చినా మొ ండిగా వ్యవహరించే వారిపైనే ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేస్తాం. సాధ్యమైనంత వరకు జంటలను కలిపేందుకే కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపిస్తుంటాం.

– పి.సురేఖ, సీఐ మహిళా పోలీస్‌స్టేషన్‌, సరూర్‌నగర్‌